అతిసారం.. అప్రమత్తం

- ముందస్తు జాగ్రత్తలు మరూ
- ఎక్కడికక్కడే నీటి పరీక్షలు.. పరిసరాల పరిశీలన
- సర్వే చేస్తూనే.. జాగ్రత్తలు కూడా చెబుతున్న బృందాలు


పెడన చెంచుల కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశుభ్రం చేయిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య


సర్వే సమయంలో బావి నీటిపై ఆరా తీస్తున్న ఆశా వర్కర్ కుమారి


నీటితొట్టిలో నిల్వ ఉన్న మురుగునీటిని పారబోస్తూ..



ఫాస్ట్ ఫుడ్ సెంటరు వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న దృశ్యం

పెడన: అతిసార వ్యాధితో పలువురు ప్రాణాలు కోల్పోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజయవాడ, జగ్గయ్యపేటలో డయేరియా విజృంభిస్తుండటంతో అన్ని చోట్లా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తన సిబ్బందితో చెంచుల కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకును క్లీన్ చేయించారు. తాగునీటి సరఫరా అయ్యే ప్రాంతాల్లో కుళాయిలు ద్వారా వచ్చే నీటిని పరీక్షించడానికి చర్యలు తీసుకున్నారు. పలు హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పానీ పూరీసెంటర్లలో తాగునీటిని పరీక్షించారు. మినరల్ వాటర్ సరఫరా చేసే ఆర్వో ప్లాంట్లను కూడా పరిశీలించి సూచనలు జారీ చేశారు. మరో పక్క ఇంటింటికీ సర్వే చేస్తున్న బృందాలు సైతం ఆయా ఇంటి యాజమానులకు డయేరియాపై జాగ్రత్తలు చెప్పడమే కాకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు. మండలంలో కూడా డయేరియాపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరామ్‌లు రక్షితనీటి పథకాలు వద్ద పరిసరాలను పరిశుభ్రం చేసేలా చూడటమే కాకుండా ఓహెచ్‌టీలను పరిశుభ్రం చేసేలా చూస్తున్నారు. తాగునీటి పరీక్షలు కూడా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పెడన పట్టణంలో రెండో రోజు కూడా తొమ్మిది బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. ఎటువంటి డయేరియా కేసులు నమోదు కాలేదని కమిషనర్ తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోండి

ఎమ్మెల్యే కాగిత


సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్సిడీ విత్తనాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గతంలో జరిగిన ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీలో అక్రమాలు వంటివి మళ్లీ రాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుడిసేవ రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, పరసా రాంబాబు, చెన్నూరు శేఖర్, బొడ్డు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: రైతుల విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం గూడూరులోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, నాయకులు పోతన స్వామి, తలుపుల వెంకట కృష్ణారావు, అన్నం హరి రామకృష్ణ, కాసగాని శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్‌సీసీ క్యాంప్ పూర్తి చేసుకున్న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రేషన్ డీలర్ల కమిషన్ చెల్లింపునకు చర్యలు

పీడీఎస్ డీటీ ఇన్‌చార్జి నీలిమ


మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీటీ నీలిమ

మోపిదేవి: నిత్యావసర సరుకులు పంపిణీ చేసే రేషన్ డీలర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన కమిషన్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు పీడీఎస్ డీటీ ఇన్‌చార్జి నీలిమ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీవిద్య అధ్యక్షతన మంగళవారం రేషన్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్స్, వీఆర్వోల సమావేశం నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ 2015 నుంచి 2023 వరకు ఈ పోస్ పంపిణీ ద్వారా మిడ్ డే మీల్స్, ఐసీడీఎస్ పథకాల కింద సరఫరా చేసిన వస్తువులపై ఇవ్వాల్సిన కమిషన్ చెల్లింపునకు పౌర సరఫరాలశాఖ కమిషనర్ నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా 2015 నుంచి 2023 వరకు పనిచేసిన డీలర్లకు రావలసిన నగదు జమ చేయడానికి వారి బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీ, ఆధార్, పాన్‌కార్డు, డీలర్ పేరు, మండలం ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మృతి చెందిన, రాజీనామా చేసిన డీలర్స్, 6ఏ కోర్టు కేసుల్లో ఉన్నవారు పనిచేసిన కాలానికి వారి చట్టబద్ధంగా వారసులు క్లెయిమ్ చేస్తే చెల్లిస్తారని తెలిపారు. అక్రమ రవాణా, రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ సునీల్ కుమార్, వీఆర్వోలు, డీలర్స్, ఎండీయు ఆపరేటర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య జరిగే కార్యక్రమంలో ఆర్టీసీ సర్వీసుల నిర్వహణపై ప్రయాణికులు 9959225466 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు సలహాలు అందించ వచ్చని పేర్కొన్నారు.

మచిలీపట్నంటౌన్: డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలను, సలహాలను తీసుకునేందుకు ఈ నెల 26వ తేదీ బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం పెద్దిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు సెల్ 9959225462కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

గుడ్లవల్లేరు: కాలేజీలో విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా నేరమని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆయన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేకమైన చర్యలతో బంగారు భవిష్యత్ కలిగిన జీవితాలను నష్టపోవద్దని విద్యార్థులకు ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్, సీఐ కె.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ మురళీధర్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్థానిక ఎస్వీఎల్ క్రాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం మాదక ద్రవ్యాల వాడకం నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ యువకులు ఎక్కువగా మాదక ద్రవ్యాలకు ఆకర్షితులవుతున్నారని, ఒకసారి అటువైపు వెళ్తే జీవితం సర్వనాశనం అయినట్టేనని చెప్పారు. విద్యార్థులను చదివించడానికి తల్లిదండ్రులు చాలా కష్టపడుతున్నారని, దాన్ని గుర్తించి బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. సీఐ త్రినాథ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారి తల్లిదండ్రులు ఎంత మానసిక క్షోభ అనుభవిస్తారో అర్థం చేసుకోవాలన్నారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపొద్దని, తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చల్లపల్లి(అవనిగడ్డ): మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. విజయక్రాంతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా, వాటితో కలిగే అనర్థాలపై విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేశారు. సీఐ నాగప్రసాద్, ఎస్ఐ చినబాబు, ప్రిన్సిపాల్ శివరాం ప్రసాద్, పలువురు అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చల్లపల్లిలో మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి విద్య


కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

కొత్తపల్లి(ఘంటసాల): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీకాకుళం సెక్టార్ పరిధిలోని ఘంటసాలపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మేరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారం, ఆట పాటలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యాబోధన చేస్తారన్నారు. ఆయా కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారని చెప్పారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ఎంపీపీ స్కూల్లో జాయిన్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెపాటి శాంతకుమారి, పాఠశాల హెచ్‌ఎం కోట స్వరూప, టీచర్ మండవ నందిని, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

గుడ్లవల్లేరు: బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలని ఏఐఎస్ఓ రామకృష్ణ అన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు మంగళవారం కొతవరంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. ఏఎంఓ ఆర్.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఎవరున్నా వెంటనే సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంఈఓలు జి.గోపాలరావు, జి.జగన్మోహనరావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



విద్యాదాఘాతం.. పూరిగుడిసె దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరిగుడిసె

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక పంచాయతీ పరిధిలోని నారాయణరావునగర్ శివారు ఎస్టీ కాలనీలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గరికపాటి యశోద నివశించే పూరి గుడిసె దగ్ధమైంది. మొవ్వ అగ్నిమాపక అధికారి కె వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఎగసిన నిప్పురవ్వలు యశోద ఇంటిమీద పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పూరిగుడిసె పూర్తిగా దగ్ధమవడంతో కట్టుబట్టలతో మిగిలింది. మంటలు పక్కనే ఉన్న కుంభా నాగేశ్వరమ్మ ఇంటికి వ్యాపించాయి. వెంటనే స్థానికులు మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న మొవ్వ అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు సిబ్బందితో హుటాహుటిన తరలివచ్చి మిగిలిన ప్రాంతాలకు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. ఘటనలో ఇంట్లో దాచుకున్న రూ.75 వేల నగదు, ల్యాప్‌టాప్‌తో పాటు పలు విలువైన వస్తువులు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో మాధవేంద్రరావు, వీఆర్వో కోళ్ళపల్లి బేబీ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని నిత్యావసర సరుకులు, దుప్పట్లు, బియ్యం, నగదు అందించారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

కోనేరుసెంటర్: తాడిగడప పరిసర ప్రాంతాల్లో ఈ నెల 27న ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడపలోని 100 అడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో రామోజీరావు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులు హాజరుకానున్న కారణంగా రవాణాకు అంతరాయం ఏర్పడకుండా ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు ఇలా

మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు ప్రయాణించే భారీ వాహనాలు 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కంకిపాడు వద్ద పూర్తిగా నిలిపివేస్తారు.

- విజయవాడ వైపు ప్రయాణించే వాహనాలకు సంబంధించి సాధారణ ట్రాఫిక్ ను పెనమలూరు నుంచి కృష్ణానది కరకట్ట మీదుగా స్క్యూ బ్రిడ్జి వరకు మళ్లిస్తారు.
- విజయవాడ వైపు నుంచి మచిలీపట్నం వెళ్లే వాహనాలను స్క్యూ బ్రిడ్జి వద్ద నుంచి విజయవాడ – అవనిగడ్డ కరకట్ట మీదకు మళ్లిస్తారు.
- తాడిగడప 100 అడుగుల రోడ్డును 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి పూర్తిగా మూసేస్తారు
- దానికి బదులుగా నిడమానూరు పోరంకి రోడ్డును వినియోగిస్తారు.
- ఏలూరు హైవే నుంచిమచిలీపట్నం వెళ్లే సాధారణ ట్రాఫిక్ కు సంబంధించి ఎనికెపాడు 'ఎస్' కటింగ్ నుంచి నారాయణపురం కాలనీ మీదుగా పోరంకి వద్ద మచిలీపట్నం హైవే మీదకు మళ్లిస్తారు.



మహిళా సాధికారతే ధ్యేయం


స్వయం ఉపాధి సాధిస్తున్న మహిళను సత్కరించిన యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ వెంకట్రావు

మచిలీపట్నంటౌన్: మహిళా సాధికారతే ధ్యేయంగా డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థ పనిచేస్తోందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ కె.వెంకట్రావు అన్నారు. పట్టాభి మెమోరియల్ సంస్థ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం సంస్థ ఆవరణలో మహిళా వ్యవస్థాపక – ఆవశ్యకత అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథి వెంకట్రావు మాట్లాడుతూ మహిళలకు సమాజంలో ఎంతో ప్రాధాన్యముందని దీంతో తమ బ్యాంకులో మహిళలకు పలు సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. రుణాలకు సంబంధించి సంస్థలో శిక్షణ పొందే అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం సంస్థలో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందడానికి స్వల్పకాలిక రుణాలు ఇవ్వడానికి దరఖాస్తులు చేశారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో శిక్షణ పొందిన 48 మంది అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పలు యూనిట్లను స్థాపించిన దుర్గ, నాగలక్ష్మి, విజయలక్ష్మిని ఆయనతో పాటు డీఆర్‌హెచ్ తాతాజీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పమిడిముక్కల: గత 24 సంవత్సరాలుగా వేల్పూరులోని ప్రాథమిక పాఠశాలకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్స్‌లు అందజేస్తున్న దాత తిరుమలశెట్టి బోసుబాబు సేవలు ప్రశంసనీయమని వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ పేర్కొన్నారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు బోసుబాబు, మహేష్ కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బాగా చదువుకుని గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న బోసుబాబుకు హెచ్‌ఎం గుండె నానిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశ్రీనివాసమూర్తి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో పూజా కార్యక్రమాలను అర్చకులు యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు(స్వామి) ఆధ్వర్యంలో నిర్వహించారు.



క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



నాగాయలంక: తహసీల్దార్‌గా ఇటీవల నియమితులైన ముప్పిరిశెట్టి హరనాథ్‌ను మంగళవారం మండల శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) నేతృత్వంలో సంఘం కార్యవర్గ సభ్యులు, కాపు ప్రముఖులు తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు తహసీల్దార్‌తో మాట్లాడుతూ నాగాయలంకలో టీడీపీ హయాంలో నిలిచిపోయిన కాపు సంక్షేమ కమ్యూనిటీ భవనం నిర్మాణంలో రెవెన్యూ సహకారం అందించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, బర్రంకుల ఎంపీటీసీ బర్మా రాంబాబు, సంఘం సలహాదారు పాలిశెట్టి మురహరిరావు, విశ్రాంత వీఆర్వో భోగాది సత్యనారాయణమూర్తి, సంఘం కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించాలి



కోసూరువారిపాలెం(మోపిదేవి): కౌలు రైతులకు ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డులపై రైతులకు అధికారులు పూర్తి అవగాహన కల్పించాలని బీజేపీ సీనియర్ నాయకులు జీవీ నగరాయులు అన్నారు. మండలంలోని కోసూరువారిపాలెంలో మంగళవారం పంటలు పరిశీలించి కౌలు రైతులతో మాట్లాడారు. ఈ కార్డులకు కేవలం 11 నెలల కాలపరిమితి ఉండటంతో రైతులకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. తద్వారా కౌతు రైతులు తమ పంటలను ఈ క్రాప్ చేయించుకోవడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, బ్యాంకు రుణాలు పొందవచ్చని రైతులకు వివరించారు. కామిశెట్టి రత్తయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరామర్శ



కోడూరు: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన అప్పికట్ల నాగభూషణం (31) కుటుంబసభ్యులను గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా) పరామర్శించారు. మంగళవారం నాగభూషణం గృహానికి వచ్చి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. నాగభూషణం హైదరాబాద్‌లో ఉద్యోగానికి వెళ్తుండగా ఈ నెల 21న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మరణించినట్లు మృతుడి తండ్రి శ్రీరామమూర్తి వివరించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని రాజా భరోసా ఇచ్చారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పులిగడ్డ(అవనిగడ్డ): స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆచార్యులు పార్థసారథి, వికనాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకుని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు జరిగాయి. అభిషేకాలతో పాటు పలువురు దంపతులు తమ పిల్లలకు భారీసంఖ్యలో అన్నప్రాసనలు చేయించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.